## విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

- ఫణిగిరి హైస్కూల్‌లో జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఎర్ర యాదగిరి ఆధ్వర్యంలో కార్యక్రమం

**నాగారం అక్టోబర్ 29ప్రజా జ్యోతి.**

నాగారం మండలంలోని ఫణిగిరి గ్రామ ప్రభుత్వ హైస్కూల్‌లో గురువారం జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఎర్ర యాదగిరి విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. సుమారు ఇరువై వేల రూపాయలు.

వివరాలు 2లో

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నల్లగొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

శుక్రవారం 30 అక్టోబర్ 2026 పేజీలు:17

# పట్టణం లో రహదారులు, మౌలికవసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ - 29వ, వార్డు లో సీసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**మిర్యాలగూడ, అక్టోబర్ 29,(ప్రజాజ్యోతి):**

మిర్యాలగూడ పట్టణంలో రహదారులు, మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేస్తానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) అన్నారు. గురువారం 29వ, వార్డులో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులలో రహదారి సౌకర్యాలు మెరుగుపరిచి ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిసి రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో అనుకున్న సమయానికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

వివరాలు 2లో

# నాగార్జునసాగర్‌కు చివరి రెడ్డి ఎమ్మెల్యే జైవీర్ రెడ్డే!

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన వ్యాఖ్యలు
- బీసీలకు కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీల ద్రోహం- రూ.60 వేల కోట్ల బీసీ నిధుల్లో ఖర్చు చేసింది రూ.2,426 కోట్లే:
- మల్లన్న ఆరోపణ

**హాలియా,అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి):**

తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు రాజకీయ అధికారం కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ చేపట్టిన పాదయాత్ర బుధవారం నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియాకు చేరుకుంది. సెప్టెంబర్ 17న గోల్కొండ కోట వద్ద ప్రారంభమైన పాదయాత్రకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

వివరాలు 2లో

# మహిళా సంఘాల బలోపేతానికి భవనం పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ ఇళ్లు

- కొండభీమనపల్లిలో మహిళా సమాఖ్య భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే బాలు నాయక్
- గిరిజానగర్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు గ్రామ సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

**దేవరకొండ, అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి) :**

గ్రామీణాభివృద్ధి, మహిళా సంఘాల బలోపేతం, పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. గురువారం దేవరకొండ మండలం కొండభీమనపల్లిలో మహిళా సమాఖ్య భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ భవనం మహిళా సంఘాల సమావేశాలు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగుతూ ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు.

వివరాలు 2లో

# పట్టణం లో రహదారులు, మౌలికవసతుల కల్పనకు కృషి

మొదటిపేజీ తరువాయి

ప్రజల అవసరాలకు అనుగుణంగా అవసరమైన చోట సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాలు లాంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్ పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, కౌన్సిలర్ జావీద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోడి రెక్క ఇంద్ర కుమార్, మోయిజ్, పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# రావులపెంట హైస్కూల్‌లో ఘనంగా బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమం

**వేములపల్లి, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి): -**

వేములపల్లి మండలం రావులపెంట గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో గురువారం 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా విద్యా ర్థులకు బాల్యవివాహాల నిషేధం, అక్రమ రవాణా, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, బాలల రక్షణపై అవ గాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో సూపర్వైజర్ పరిమి రజిని, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, సర్పంచ్ చందరబోయిన చంద్రయ్య మాట్లా డుతూ విద్యార్థులు బాగా చదువు కొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేసుకోవాలని తెలిపారు. అలాగే, అపరిచితులు ఇచ్చే వస్తువులను తీసుకోవద్దని, మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కావద్దని, ఆపదలో ఉన్నప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా పోలీస్ అత్యవసర నంబర్ 100ను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పల్ల గోవర్ధన్, వార్డు సభ్యుడు నాగరాజు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు శారద, వెంకటరమణ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నాగార్జునసాగర్‌కు చివరి రెడ్డి ఎమ్మెల్యే జైవీర్ రెడ్డే!

మొదటిపేజీ తరువాయి

అనంతరం హాలియా ప్రధాన సెంటర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు బీసీలకు 45 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో నంబర్ 166 తీసుకొచ్చారని, అప్పట్లో మంత్రిగా ఉన్న కుందూరు జానారెడ్డి ఇతరులతో కలిసి న్యాయస్థానంలో కేసులు వేయించి రిజర్వేషన్ల అమలుకు అడ్డుపడ్డారని మల్లన్న ఆరోపించారు. బీసీలకు జరిగిన అన్యాయంపై జానారెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "నాగార్జునసాగర్‌కు చివరి రెడ్డి ఎమ్మెల్యే జైవీర్ రెడ్డే" అని వ్యాఖ్యానిస్తూ, స్థానిక సులభ్ కాంప్లెక్స్‌కు జానారెడ్డి పేరు పెడతానని అన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. బీసీల అభివృద్ధికి మూడేళ్లలో రూ.60 వేల కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించినప్పటికీ, అసెంబ్లీ ప్రశ్న నంబర్ 4429కు సంబంధించిన రికార్డుల ప్రకారం రూ.2,426 కోట్లు మాత్రమే ఖర్చు

చేసినట్లు ఆరోపించారు. బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్ల నిర్వహణ, స్టడీ సర్కిళ్లు, బీసీ కార్పొరేషన్లు, చేతివృత్తుల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని కోరారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ఓట్లు నిర్ణయాత్మకమని మల్లన్న పేర్కొన్నారు. నియోజకవర్గంలో 2,33,514 ఓట్లు ఉండగా, బీసీల ఓట్లు 1,27,408కు పైగా ఉన్నాయని, ఈ వర్గాలన్నీ కలిస్తే సుమారు 2.15 లక్షల ఓట్లు ఉంటాయని తెలిపారు. బీసీలు ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఇదే హాలియా గడ్డపై నుంచి జానారెడ్డికి సవాల్ విసురుతున్నానని, 766 రోజుల తర్వాత తమ రాజకీయ బలాన్ని చూపిస్తామని ప్రకటించారు. తెలంగాణలో బీసీల జనాభా గణాంకాల్లో వ్యత్యాసాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలుతో బీసీ యువతకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. భూమిలేని పేదలకు భూములు పంపిణీ చేయాలని, బీసీ ప్రభుత్వం ఏర్పడితే ఈ దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎన్నికల గుర్తు 'కత్తెర' అని, 2028లో బీసీల రాజకీయాధికార సాధనే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలు ఐక్యంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్ యాదవ్,క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్ రాష్ట్ర కార్యదర్శి బీకు నాయక్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్ల వాసుదేవ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల బలోపేతానికి భవనం పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ ఇళ్లు

మొదటిపేజీ తరువాయి

ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలు అనంతరం గిరిజానగర్ తండా గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. సొంత ఇల్లు పేద కుటుంబాలకు భద్రతతోపాటు ఆత్మగౌరవాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన పేదలకు ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ ఈ సందర్భంగా రెండు గ్రామాల ప్రజలతో మాట్లాడిన ఎమ్మెల్యే విద్యుత్ సరఫరా, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను అడిగి

తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులతో పాటు ఆలంపల్లి నర్సింహా, మారుపాకుల సురేష్ గౌడ్, లోకసాని శ్రీధర్ రెడ్డి, హనుమంతు వెంకటేష్ గౌడ్, కొర్ర రాంసింగ్, కిన్నెర హరికృష్ణ, కొనెడ్డి శ్రీను, నేనావత్ బుజ్జిభాయి హరిలాల్, వంగూరు రాజు గౌడ్, మండల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, పట్టుదలతో చదివి జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, యాకూబ్ పాషా, మల్లయ్య, రాజేశ్వరి, గురువయ్య, యాకయ్య,, విద్యార్థి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# అడుగంటుతున్న భూగర్భ జలాలు

## - సన్నగిల్లుతున్న రైతన్నల ఆశలు

## - చేతికొచ్చిన పంటలు ఎండలకు నేలపాలు

**ఆలేరు అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి)**

ఎన్నో ఆశలతో సాగుచేసిన ఖరీఫ్ పంట కన్నీరే మిగిల్చింది. మొదట్లో వర్షం వచ్చే సూచన ఉండడంతో బోర్లు పోయడంతో మండలంలో రైతులు వరిసాగు చేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేకపోవడంతో ఉష్ణోగ్రతలు పేరిగి భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. చుట్టుపక్కల కాలువల ద్వారా చెరువులు నింపి నీళ్లు వస్తున్నాయని రైతులు అనుకొని వరి సాగు చేశారు. కానీ చెరువులు నింపకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి సాగుచేసిన పంట చేతికొచ్చేలోపే మండే ఎండలకు నేలకోరుగుతున్నాయి.పంట చేతికొస్తుందని ఆశించిన అన్నదాతకు అడుగంటిన బోర్లతో నిరాశ మిగిల్చింది. పంటలు కాపాడుకోవడానికి రైతన్న ఆరాటం అంతా ఇంత కాదు. చివరి ప్రయత్నంగా బోర్లు వేసి పంటను కాపాడుకోవాలని చేస్తున్న ప్రయత్నం విఫలం అవడంతో అప్పుల పాలవుతున్నారు.అధికారులు చెరువులు నింపి భూగర్భ జలాలు పెరిగే చర్యలు తీసుకున్నట్లయితే పంటలు చేతికి వచ్చేవి. కండ్ల ముందే చేతికి వచ్చిన పంట ఎండిపోవడంతో పశువులకు గొర్లకు మేతగా మారింది.యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన వరి పంట రైతు మామిడాల అంజయ్య 8 ఎకరాలు వరి సాగు చేశారు. ముందు చెరువులు కుంటలు నింపుతున్నామని ప్రజాప్రతితులు చెప్పినప్పటికీ వరి పంట సాగు అవుతుందని 8 ఎకరాలు వరి సాగు చేశారు కానీ చెరువులు కుంటలు నింపకపోవడంతో బోర్లు ఎత్తివేసాయి. పంట చేజారిపోవడంతో పంటను పశువులకు మేతగా వేశారు. పంట పొలాల్లో పచ్చదనం కనుమరుగైపోయి ఎండిన చేన్లు దర్శనమిస్తున్నాయి. దీంతో కొందరు రైతులు పంటను కోయడం కంటే పశువులను మేపడమే మంచిదని భావిస్తూ పొలాల్లోనే పశువులను కట్టేస్తున్నారు. సాగు కోసం విత్తనాలు ఎరువులు పురుగుల మందులు కూలీలకు భారీగా ఖర్చు చేసిన రైతులకు చివరకు పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి నెలకొంది . పంట చేతికొచ్చే సమయంలో పరిస్థితులు అనుకూలించకపోవడంతో అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి. పంట సాగు కోసం అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని ప్రస్తుతం పంట పరిస్థితి చూస్తుంటే పెట్టుబడి వస్తుందో రాదు అన్న అనుమానం నెలకొంది. పంట నష్టం పై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచన వేసి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని రైతుల కోరుతున్నారు.

**అప్పుల ఊబిలో అన్నదాత**

చేతికొచ్చిన పంటలను కాపాడుకునేందుకు అన్నదాత తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో గ్రామలలో పలు రైతులు ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తూ పంటను కాపాడేందుకు ప్రయత్నం చేసినారు. అప్పుడు చాలా ఖర్చుతో కూడుకొని పొట్ట కొచ్చిన పంటను కాపాడుకొని లాభాలు రాకుండా పెట్టుబడి వెళ్లడానికి నాన తంటాలు ఎండాకాలంలో. శ్రీనివాసపురం పటేల్ గూడెం కొలనుపాక గుండ్లగూడెం రాఘవాపురం గ్రామాలలో భూగర్భ జలాలు మొత్తం ఎండిపోయి పంట పొలాల్లో నెర్రెలు పారే విధంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పుడు అయితే విద్యుత్ కొరత అధికంగా ఉండడంతో ట్రాక్టర్ల ద్వారా నీటి నీ సరఫరా చేయడం సరిపోదు. అలాంటి ప్రయత్నాలు చేసి విఫ్లమయ్యారు. ప్రతిరోజు 8 గంటల నుండి 10 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా అవుతుండడంతో నీటి కొరత ఏర్పడింది. వేల రూపాయలు చెల్లించి బోర్లు వేసిన లాభం లేకుండా పోయింది. రైతులు ఇలాంటి ప్రయత్నాలు చేసిన పంటలు కాపాడుకోలేక ఆందోళన చెందుతున్నారు. అధికారులు పాలకులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

**ఏడున్నర ఎకరాల పంట పొలం ఎండిపోయింది మామిడాల**

**అంజయ్య రైతు కొలనుపాక**

ఏప్పటి లాగానే వరి పంట సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాను. అయితే గతంలో లాగా 8 ఎకరాల వరి పంట సాగు చేశా ఏడున్నర ఎకరాలు వరి పంట ఎండిపోయింది. ఎకరానికి 30 వేల రూపాయలు పెట్టుబడి అయ్యింది మొత్తం 2లక్షల నలభై వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన. లో వోల్టేజ్ కరెంట్ వల్ల బోర్లు ఎండిపోతున్నాయి అందుకు బోర్లు వేద్దామని ఆలోచన వచ్చి మూడు బోర్లు వేశాను మూడు బోర్లకు కలిపి మొత్తం 2,50,000 రూపాయలు ఖర్చు అయింది. కానీ భూగర్భ జల లు అడుగంటి పోవడంతో చుక్క నీరు కూడా బయటికి రాలేదు. వ్యవసాయం పంట సాగు చేసినందుకు ఐదు లక్షల రూపాయలు నష్టపోయాను ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నాను.

**లో వోల్టేజ్ కారణంగా పంట ఎండిపోయింది గడ్డం యశ్వంత్**

**రెడ్డి గుండ్ల గూడెం రైతు**

విద్యుత్ ఎనిమిది గంటలు ఇవ్వడంతో పాటు ఓల్టేజి సమస్య చెప్పగా ఉండడంతో

గతంలో లాగా మూడు ఎకరాల భూమి సాగు చేశాను కరెంటు లో వోల్టేజ్ కారణంగా ఎకరం పొలం ఎండిపోయింది. ఎకరానికి 30000 ఖర్చు అయింది. ఎండిపోయిన పంటను పశువులకు మేతగా వేశాను. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.

**మూడు ఎకరాలు సాగుచేస**

**రెండు ఎకరాలు ఎండిపోయింది**

**బంద్రు ఆంజనేయులు పటేల్**

**గూడెం రైతు**

భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో మా గ్రామానికి నీరు లేకపోవడంతో రెండు ఎకరాల వరి పంట ఎండిపోయింది. మొత్తం ఏడెకరాల భూమి ఉంది మూడు ఎకరాలు వరి పంట సాగు చేశాను. రెండెకరాలు ఎండిపోయింది. ఎకరానికి 35000 ఖర్చు అయింది మొత్తం 70 వేల ఖర్చు వచ్చింది.

# ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన 80 మంది

**నల్లగొండ అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

నకిరేకల్ నియోజకవర్గం లోని కట్టంగూర్ మండలం మల్లారం గ్రామానికి చెందిన వార్డు సభ్యులు దాసరి లింగయ్య, దాసరి కళమ్మతో పాటు మొత్తం 80 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**నల్లగొండ అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

నకిరేకల్ నియోజకవర్గంలోని కట్టంగూర్ మండల కేంద్రంలో సత్య సాయి ఫంక్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా వ్యవహరించి నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రామన్నపేటలో 2ఖ రన్ నిర్వహణ

## పోలీసులు, విద్యార్థులు, యువత ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిరోజూ వ్యాయామం చేయాలి

### -- జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో రామన్నపేటలో 2ఖ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ హాజరై, రన్‌లో ముందుండి పాల్గొని పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువతకు ఉత్సాహాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి రోజూ వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని సూచించారు. పోలీసు విధుల్లో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విద్యా ర్థులు, యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ఫిట్‌గా ఉండేందుకు నిత్యం వ్యాయామం చేయాలని పిలుపు నిచ్చారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, పోలీసు శాఖకు మరియు ప్రజలకు మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి,రామన్నపేట సీఐ శ్రీ ఎం. రవి, రామన్నపేట ఎస్ఐ జి. సతీష్, వలిగొండ ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, ఆత్మకూరు (ఎం) ఎస్ఐ లక్ష్మీనారాయణ, మోత్కూరు ఎస్ఐ సతీష్, అడ్డగూడూరు ఎస్ఐ వెంకట్ రెడ్డి, ఏఎస్ఐ సురేందర్, హెడ్ కానిస్టేబుళ్ల కమలాకర్, వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది లింగస్వామి, స్వామి నాయక్, ప్రవీణ్, ప్రశాంత్, స్వామి, మధు, కృష్ణమూర్తి, నరసింహా, లావణ్య, కవిత, సైదులు, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

# కరువు బూఛీ... అమాంతం పెరిగిన బియ్యం ధరలు...!

## - అల్లాడుతున్న సామాన్యులు - బియ్యం ధరలను ప్రభుత్వం నియంత్రించాలి -మట్టిమనిషి వేనేపల్లి

**మిర్యాలగూడ, అక్టోబర్ 29,(ప్రజాజ్యోతి):**

ఎల్ నినో... కరువు బూఛీ సాకుగా చూపి... ధాన్యం నిల్వలు దాచి.. బియ్యం ధరలను అమాంతం పెంచడ తో.. భవిష్యత్తు తలుచుకుని సామాన్యుడు ఆందోళన చెందుతున్న పరిస్థితి దాపురించిందని, పెంచిన బియం ధరలను ప్రభుత్వం నియంత్రించాలని మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు కోరారు. గురువారం స్థానికంగా మాట్లాడుతూ గత వానకాలం,యాసంగి, రైతుల వద్ద క్వింటాలుకు 2,300 రూపాయలకు కొన్న వడ్ల ను బియ్యంగా మార్చి, ప్రస్తుతం క్వింటా 10 వేల వరకు బహిరంగ మార్కెట్ లో అమ్ముతున్నారని,ఇది అన్యాయమైన విషయమన్నారు.ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని పాత బియ్యంకు ధరలు పెంచకుండా చూడాలన్నారు.ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో కొంటున్న వడ్లకు ధరలు తగ్గించి, బియ్యానికి మాత్రం

**భారీగా రేటు పెంచారన్నారు.**

అంత భారీ వ్యత్యాసం ఉండకుండా చూడాలని కోరారు.మాములు గా వడ్లు క్వింటా కు 2,300 కొని బియ్యం క్వింటా 4000కు అమ్మితేనే రైస్ మిల్లర్లకు విపరీతంగా లాభాలు వచ్చాయని ఇప్పుడు సిండికేట్ గా మారి బియ్యం ధరలు అమాంతంగా పెంచితే మూడు రెట్లు లాభాలు పొందేందుకు వ్యాపారులు రైస్ మిల్లర్లు ప్రయత్నిస్తున్నారన్నారు. ఒకవైపు పంట సక్రమంగా లేదని చెబుతూనే మరోవైపు వందల కోట్లతో పెద్ద పెద్ద రైస్ మిల్లులు కడుతతున్నారన్నారు.ఒకవైపు కరువు ఇంకోవైపు తుపాన్ రైతులను ప్రజలను పీడిస్తుంటే మిల్లర్లు మానవీయంగా వ్యవరించాల్సింది పోయి అవకాశాన్ని, అడ్డం పెట్టుకుని, అడ్డదారిలో లాభాల కోసం ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు.ఒకవైపు కరువు తో పంటలు పండక రైతులు అల్లాడుతున్నారు.ఈ పరిస్థితుల్లో బియ్యం ధరలు పెంచి ప్రజలనుదోచుకోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ధాన్యం విదేశాలకు ఎగుమతి కాకుండా చూడాలన్నారు.వినియోగదారులకు భారం కాకుండా రైతులు,మిల్లర్లు నష్ట పోకుండా ఒక విధి విధానం ను రూపొందించేందుకు ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలని కోరారు.

# పేద మహిళ వైద్య చికిత్సకు రూ.6 లక్షల ఎల్ఓసీ మంజూరు

- బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**ఆలేరు అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ పరిధికి చెందిన ఎమ్మె అంజమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె వైద్య చికిత్సకు రూ.6 లక్షల ఖర్చు అవుతుందని తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బాధిత కుటుంబానికి అండగా నిలిచి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.6 లక్షల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేయించారు. ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన ఎల్ఓసీని ఆలేరు మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లెల శ్రీకాంత్ బాధిత కుటుంబానికి అందజేశారు. ఆపద సమయంలో ఆదుకున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# తోటి మిత్రునికి ఆర్థిక సహాయం

**నార్కట్ పల్లి, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి):**

ఆపదలో ఉన్న వారికి మేము సైతం మేమున్నామంటూ లారీ డ్రైవర్ స్నేహితునికి ఆర్థిక సహాయం చేసిన సంఘటన కొండపాకని గూడెం గ్రామంలో శ్రీ మల్లికార్జున లారీ యూనియన్ సభ్యులు గుండెబోయిన ఐలయ్య ఇటీవల కిడ్నీ సర్జరీ కావడంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనకు లారీ యూనియన్ తరపున లారీ డ్రైవర్లు 22వేల రూపాయలఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎండి కరిముల్లా, ఉపాధ్యక్షుడు జేరిపోతుల వరప్రసాద్ గౌడ్, గుండె బోయిన శివశంకర్, మల్లేష్ యాదవ్, నరసింహ, యాదగిరి, స్వామి, శంకర్, సత్యనారాయణ, నగేష్, ఐలయ్య, అమరేందర్ రెడ్డి, సైదులు, మల్లేష్, రామలింగయ్య, శంకర్, నరేందర్ రెడ్డి, మల్లారెడ్డి, మధుసూదన్ రెడ్డి, నర్సిరెడ్డి, సుభాన్, రామలింగం, నరేష్ పాల్గొన్నారు.

# రైతులు దళారులను నమ్మొద్దు..

## ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

## క్వింటాల్‌కు రూ.2,460 ధర..

## మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ:

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ఆలేరు, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి):**

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసి, గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొలనుపాక గ్రామంలో గతంలో ఈ కేంద్రం ద్వారా 50 వేల బస్తాల ధాన్యం కొనుగోలు చేసినట్లు గుర్తుచేశారు. ఈసారి కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించడంలో సహకరించిన తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు**

రైతులు క్వింటాల్ ధాన్యాన్ని రూ.2,460 ధరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. దళారుల మాటలు నమ్మి నష్టపోవద్దని హెచ్చరించారు. ధాన్యం విక్రయించిన మూడు రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.రైతుల అవసరాలకు అనుగుణంగా పీఏసీఎస్, ఎఫ్‌పీఓ, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా, అవసరమైన ప్రాంతాల్లో అదనపు కొనుగోలు ఏర్పాట్లు చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు.ఎల్‌నినో ప్రభావం, సముద్ర జలాల ఉష్ణోగ్రతల్లో మార్పుల కారణంగా రాబోయే పంటలపై ప్రభావం పడే అవకాశమున్నందున, వ్యవసాయ శాఖ సూచనల మేరకు రైతులు పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జనగాం ఉపేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ యాకమ్మ వెంకటేష్, ఉపసర్పంచ్ విజేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మోత్ మైసయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ, పీఏసీఎస్ డైరెక్టర్లు చాడ రాజు, బండ వీరమల్లయ్య, వట్టిపల్లి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నర్సింలు, సీఈవో వెంకటరెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ భరోసా

- జిల్లా సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు గుండు రామాంజిగౌడ్

**గరిడేపల్లి,అక్టోబర్ 29(ప్రజా జ్యోతి):**

ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించి,వారి ఆత్మగౌరవా న్ని నిలబెట్టడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షు డు,రాయినిగూడెం గ్రామ సర్పంచ్ గుండు రామాంజిగౌడ్ అన్నారు.గురువారం గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. పేద,మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం నిరుపేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందని రామాంజిగౌడ్ పేర్కొన్నారు.ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాల న్నదే ప్రభుత్వ లక్ష్యమని,ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యద ర్శి సునీత,మాజీ ఎంపీటీసీ బాలుదూరి సందీప్,గ్రామ శాఖ అధ్యక్షుడు శంభయ్య రాష్ట్ర డీలర్ల కార్యదర్శి గుండు గురవ య్య,యువజన నాయకులు గుండు నరేష్,నరసింహ,లబ్ధిదా రులు,గ్రామ పెద్దలు,అధికారులు పాల్గొన్నారు.

# నెలలు నిండని శిశువులకు యశోద ఆసుపత్రిలో అధునాతన వైద్య సేవలు

**దేవరకొండ, అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి) :**

నెలలు నిండకముందే జన్మించిన, తక్కువ బరువుతో పుట్టిన, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నవజాత శిశువులకు మెరుగైన వైద్య సంరక్షణ అందించేందుకు హైదరాబాద్ మలక్‌పేటలోని యశోద ఆసుపత్రిలో లెవల్–XXX నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ) సేవలు అందుబాటులో ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. పుట్టిన తొలి రోజులు నవజాత శిశువులకు అత్యంత కీలకమని, ఈ సమయంలో ప్రత్యేక వైద్య పర్యవేక్షణ అవసరమని కన్సల్టెంట్ పీడియాట్రిషియన్, నియోనేటాలజిస్ట్ డాక్టర్ బి. ప్రశాంత్ బాబు తెలిపారు. శ్వాస సంబంధిత సమస్యలు, తీవ్రమైన ఇన్ఫెక్షన్లు, కామెర్లు, ఆక్సిజన్ లోపం వంటి సమస్యలకు ఆధునిక వైద్య చికిత్సతో పాటు ప్రత్యేక పోషకాహార సంరక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. శిశువులు పాలు తాగకపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, శరీర ఉష్ణోగ్రతలో మార్పులు, మూర్ఛలు, అధిక నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఏవీపీ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ.. శిశువుల ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా చికిత్స అందించడంతో పాటు, ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.



**మరిన్ని వివరాలకు:** ఎ. వాసుకిరణ్ రెడ్డిని 97057 71230, 99499 98378 నంబర్లలో సంప్రదించవచ్చు.

---

## నవంబర్ 15న నల్గొండలో జరిగే రైతు బహిరంగ సభలు

# జయప్రదం చేయండి

## – కల్లూరి మల్లేశం,

## – సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

**ఆలేరు అక్టోబర్ 29(ప్రజాజ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో నవంబర్ 15న నల్లగొండలో జరిగే ఆలిండియా రైతు మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ రైతుల కల్లాలుకు, రైతుల ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పొట్ట కొట్టే నల్ల చట్టాలను తీసుకొచ్చి బలవంతంగా రైతాంగం పై రుద్దాలని ప్రయత్నం చేసిన రైతు ఉద్యమాలు ప్రభుత్వం మెడలు వంచి రైతులు తమ హక్కులను కాపాడుకోవడంలో విజయం సాధించారని అన్నారు. దేశంలో రైతు ఉద్యమం ఇతర ప్రజా సంఘాల ఉద్యమాలకు మార్గదర్శకం అయ్యాయని రైతులు చేసిన పోరాటం ప్రస్తుతం అన్ని ప్రజా సంఘాలు అనుసరించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాయని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కరువు విలయతాండవం చేస్తుంటే కరువు నివారణ చర్యలు తీసుకోకుండా రైతాంగం పట్ల కనీసం చిత్తశుద్ధి లేకుండా ఆలోచన చేయకుండా ఉందని కరువుతో రాష్ట్రమంతా అల్లాడుతుంటే మూసి సుందరీకరణను ముందుకు వేసుకోవడం తెలంగాణలో రైతాంగం పట్ల తెలంగాణ ప్రజల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తుందని అన్నారు. ఈ పరిస్థితులలో నవంబర్ 15 నుండి 18 వరకు జరుగు తున్న అఖిలభారత రైతు సంఘం దేశవ్యాప్తంగా భవిష్యత్తులో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన రైతు ఉద్యమాన్ని కార్మిక కర్షక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఐక్యం చేసే విధంగా వివిధ రూపాయలలో పోరాటాలను నిర్మించుకోవడంలో ఈ మహాసభ కర్తవ్యాలను నిర్ణయించు కుంటుందని ఈ మహాసభల సందర్భంగా నవంబర్ 15న పెద్ద ఎత్తున రైతు బహిరంగ సభ నిర్వహిస్తున్నందున ఈ బహిరంగ సభను రైతాంగము కార్మికులు కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్, నాయకులు మోరిగాడి రమేష్, వడ్డేమాన్ బాలరాజు గనగాని మల్లేష్ మోరిగాడి అశోక్ మోరిగాడి రాజు మొరిగాడి స్వరూప మోదిగాడి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

---

# ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

## – సర్పంచుల తీరుపై

## ఎంపీడీవో అసంతృప్తి

**చింతలపాలెం, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి) :**

మండల సర్వసభ్య సమావేశాలకు సర్పంచులు తప్పనిసరిగా హాజరై గ్రామాల అభివృద్ధికి సంబంధించిన సమస్యలపై చర్చించాలని అధికారులు సూచించారు. చింతలపాలెం మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. అయితే పలువురు సర్పంచులు, వివిధ శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజయ్యారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఆండాలు సర్పంచులకు సూచించారు. నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ పనుల అమలులో ఆశించిన పురోగతి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రామాల్లో అభివృద్ధి పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఇందులో భాగంగా ఇంకుడు గుంతలు, పంట కుంటలు, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. పశుగ్రాసం పెంపకం, తోటల అభివృద్ధిని ప్రోత్సహించడంతోపాటు అవసరమైన ప్రాంతాల్లో పశువుల నీటి తొట్లను నిర్మించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి, నీటి సంరక్షణకు సంబంధించిన పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో ఆండాలు, తహసీల్దార్ రామకృష్ణారెడ్డి, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

## – కూనూరు సంజయ్ దాస్ గౌడ్

**చిట్యాల అక్టోబర్ 30 ప్రజా జ్యోతి**

చిట్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 38 విద్యార్థుల పరీక్ష ఫీజు మొత్తాన్ని మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కూనూరు సంజయ్ దాస్ గౌడ్ ప్రధానోపాధ్యాయురాలు సుశీలకు విద్యార్థుల సమక్షంలో అందజేశారు. వరుసగా రెండు సంవత్సరాలు ఫీజు చెల్లిశీచాడు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థుల జీవితంలో ఎంతో ముఖ్యమని కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు, సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని, ప్రతిరోజూ చదివిన పాఠ్యాంశాలను పునశ్చరణ చేసుకుంటూ పరీక్షలకు సిద్ధం కావాలని తెలిపారు. పరీక్షలను భయంతో కాకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని, క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడే తత్వం విజయానికి పునాదులని పేర్కొన్నారు. పదో తరగతి అనంతరం తమకు ఆసక్తి ఉన్న కోర్సులను ఎంచుకొని భవిష్యత్తు లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించడంతో పాటు సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడాలనే ఉద్దేశంతో పరీక్ష ఫీజు అందించడం సంతోషంగా ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడుతూ పరీక్ష ఫీజు అందించిన సంజయ్ దాస్‌కు ప్రధానోపాధ్యాయురాలు సుశీల, ఉపాధ్యాయుల బృందం కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయురాలుబోడ సుశీల, నేస్తం స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ టీ.జీ లింగశీ గౌడ్, తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద వేణు గోపాల్ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జోగు లింగస్వామి, బత్తుల నాగరాజు గౌడ్,ఉపాధ్యాయులు కోనం శ్రీనివాసులు,చిలకరాజు శ్రీనివాస్,పద్మజ ,కవిత ,ఎన్ సైదులు ప్రసన్న శైలజ ఎండీ సాదిక్ సౌమ్య సరళ తదితరులు పాల్గొన్నారు

# హయత్‌నగర్‌లో నూతన ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు

## – ప్రజా కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన వడ్త్య రమేష్

**దేవరకొండ , అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి) :**

హయత్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రజా కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ దేవర కొండ నియోజకవర్గ నాయకుడు వడ్త్య రమేష్ పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిని లాంఛనంగా ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి యాజమాన్య సభ్యులు వడ్త్య రమేష్‌ను శాలువాతో ఘనంగా సత్క రించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రి అందుబాటులోకి రావడం సంతోషకరమని కార్యక్రమంలో పాల్గొన్నవారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్య సభ్యులు విజయ్, రాజ్, రమేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# వేషధారణతో బోధన.. విద్యార్థుల్లో ఆసక్తి!

## మీరాబాయి, ఝాన్సీ లక్ష్మీబాయిగా మారి పాఠాలు బోధిస్తున్న హసీనా

## పసునూరు మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలి వినూత్న ప్రయోగం

**నాగారం,అక్టోబర్ 29 ప్రజా జ్యోతి.**

విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా చేయడంతో పాటు, వారిలో చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు పసునూరు తెలంగాణ మోడల్ స్కూల్ హిందీ ఉపాధ్యాయురాలు హసీనా వినూత్న బోధనా పద్ధతిని అనుసరిస్తున్నారు. భారతీయ చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించుకున్న భక్తురాలు మీరాబాయి, వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో తరగతి గదిలో పాఠాలు బోధిస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు.

**పాత్రధారణతో పాఠాలు ఆచరణాత్మక విద్య.**

సాధారణ బోధనా పద్ధతులకు భిన్నంగా చారిత్రక ప్రముఖుల వేషధారణతో వారి జీవిత విశేషాలు, వ్యక్తిత్వం, గొప్పతనాన్ని వివరిస్తూ హిందీ పాఠాలను బోధిస్తున్నారు. మీరాబాయి పాత్ర ద్వారా భక్తి, పట్టుదల, ఆత్మవిశ్వాసం వంటి విలువలను, ఝాన్సీ లక్ష్మీబాయి పాత్ర ద్వారా ధైర్యసాహసాలు, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి స్ఫూర్తిని విద్యార్థులకు తెలియజేస్తున్నారు.

**హిందీపై పెరుగుతున్న మక్కువ.**

ఈ వినూత్న విధానం వల్ల విద్యార్థుల్లో హిందీ భాషపై ఆసక్తి పెరగడంతో పాటు పదజాలం, ఉచ్చారణ, మాట్లాడే నైపుణ్యాలు మెరుగుపడేందుకు దోహద పడుతోంది. పాత్రధారణ ద్వారా పాఠాలు నేర్చుకోవడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత, జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందుతున్నాయి. చదువును ఆనందదాయకమైన అనుభవంగా మార్చడంలో ఈ విధానం కీలకంగా నిలుస్తోంది.

**ఉపాధ్యాయురాలిని అభినందించిన ప్రిన్సిపాల్.**

హిందీ ఉపాధ్యాయురాలు హసీనా అనుసరిస్తున్న వినూత్న బోధనా విధానాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ వేముల బాలరాజు ప్రత్యేకంగా అభినందించారు. పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధిం చడంతో పాటు విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనాశక్తిని పెంపొందించే ఇలాంటి ప్రయత్నాలు అభినందనీయమని పేర్కొన్నారు. పుస్తక జ్ఞానంతో పాటు చారిత్రక ప్రముఖుల జీవితాల ద్వారా నైతిక విలువలు, ధైర్యసాహసాలు,

దేశభక్తిని నేర్పించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పాఠశాలలో ఇలాంటి వినూత్న విద్యా కార్యక్రమాలను ప్రోత్సహిస్తామని ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఉపాధ్యాయురాలు హసీనా చేస్తున్న ఈ ప్రయత్నం ఇతర ఉపాధ్యాయులకు సైతం స్ఫూర్తిదాయకమని పాఠశాల ఉపాధ్యాయ బృందం అభిప్రాయపడింది. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ వేము బాలరాజు, వైస్ ప్రిన్సిపాల్ బల్గూరి చంద్రబాబు, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, లింగరాజు, రవి, సోమసుందర్, సాధన, కృష్ణ, రాధ, సుమారాణి, నాగరాజు, వీరన్న, అశోక్, పీడీ మహేష్, కళింగయ్య, మహేష్, రమేష్, నరేష్, వెంకన్న, రవీందర్, వెంకటరమణ, తిరుమల, సాయి తదితరులు అభినందించారు.

# మైనారిటీ మహిళల ఆర్థిక స్వావలంబనకు కుట్టు మిషన్ల పంపిణీ

## - ఇందిరమ్మ మహిళా శక్తి పథకంతో ఉపాధి అవకాశాలు

## - మైనారిటీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఎమ్మెల్యే బాలు నాయక్

**దేవరకొండ, అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి) :**

మైనారిటీ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. గురువారం దేవరకొండ పట్టణంలోని సాయిశివ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ, తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళా శక్తి పథకంలో భాగంగా ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

### మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి

ఈ సందర్భంగా బాలు నాయక్ మాట్లాడుతూ, గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనూ సొంత నిధులతో ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు అందజేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా కుట్టు మిషన్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కుట్టుపని ద్వారా ఉపాధి పొందాలని, తద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని మహిళలకు సూచించారు.

### మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యత

దేవరకొండ నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీలతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మసీదుల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు.

### కబరస్తాన్‌కు ప్రహరీ గోడ, బజార్లలో సీసీ రోడ్లు

దేవరకొండ పట్టణంలోని ముస్లింల కబరస్తాన్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని బాలు నాయక్ హామీ ఇచ్చారు. ముస్లిం బజార్లతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని, అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమన్నారు. ఉర్దూ మీడియం విద్యార్థినులకు మెరుగైన విద్య దేవరకొండ బాలికల పాఠశాలలో ఉర్దూ మీడియం విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయినులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. మైనారిటీ బాలికలకు విద్యా అవకాశాలు మెరుగుపరిచి, వారి భవిష్యత్తుకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, విద్యా సదుపాయాలను మెరుగుపరచడం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే బాలు నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ రయీస్, ఆలంపల్లి నర్సింహా, హనుమంతు వెంకటేష్ గౌడ్, దూదిపాల వేణుధర్ రెడ్డి, లోకసాని శ్రీధర్ రెడ్డి, ముచ్చర్ల గిరి, మహమ్మద్ నజీరోద్దీన్, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రామానుజన్ మ్యాథ్స్ ఒలంపియాడ్

## - 20 26 పరీక్షల్లో విద్యార్థులఒక్ట్రీ విద్యార్థుల ప్రతిభ

**నార్కట్ పల్లి, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి):**

జాతీయ స్థాయిలో 2026 సెప్టెంబర్ లో నిర్వహించిన రామానుజన్ మ్యాథ్స్ మెటిక్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో ఒక్ట్రీ పాఠశాల విద్యార్థులు ఘనమైన ప్రతిభను కనబరిచారు. పాఠశాలలకు చెందిన 30 మందివిద్యార్థిని విద్యార్థులు రెండో స్థాయి ( లెవెల్ -1) పరీక్షకు అర్హత సాధించారు. పాఠశాల ప్రతిష్టమైన విద్యా ప్రణాళిక ఉపా ధ్యాయుల అంకితభావం, విద్యార్థుల కృషి విజయానికి దూర పడిందని యాజమాన్యం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ తుమ్మలపల్లి హనుమంత రెడ్డి, గడ్డం మంగారెడ్డి, ఎద్దుల సునీల్ రెడ్డి ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు మేమంటూ సత్కరించి అభినందించారు. విద్యార్థుల విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# మాల్ ప్రాంత విద్యార్థులకు బస్ పాస్ కౌంటర్లు ఏర్పాటు చేయాలి

## - విద్యార్థులకు సరిపడా బస్సు సౌకర్యం కల్పించాలి. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్

**దేవరకొండ, అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి) :**

మాల్ ప్రాంత విద్యార్థులు బస్ పాసులు పొందేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ డిమాండ్ చేశారు. విద్యార్థులకు అందుబాటులో ఉండేలా మాల్ ప్రాంతంలో బస్ పాస్ కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, వారి అవసరాలకు అనుగుణంగా సరిపడా బస్సులను నడపాలని కోరారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సంబంధిత డిపో టీఐ-3 అధికారి దీప్లా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు బస్ పాసుల కోసం ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సభావత్ వినోద్, నేతల జైరాం, ఎనుపోతుల పరమేష్, విజయ్, శివచరణ్, ఆకాష్, ప్రణీత్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

## - ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ఆలేరు అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని ప్రాథమిక వ్యవసాయ మార్కెట్లో ఎఫ్ పి ఓ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రం ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర పొంది లాభాల బాటలో నడవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ ఆంజనేయులు, తాసిల్దార్ ఆంజనేయులు, పిఎసిఎస్ చైర్మన్ జనగాం ఉపేందర్రెడ్డి, ఏవో శ్రీనివాస్, కార్యదర్శి పద్మజ, నిర్వాహకులు వస్పరి స్వామి, పిఎసిఎస్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి...

## - న్యాయమూర్తి డి.టి.పృథ్విరాజ్

**హాలియా,అక్టోబర్29(ప్రజా జ్యోతి):** విద్యార్థులు పోక్సో చట్టం,డిజిటల్ అక్షరాస్యత సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని నిడమనూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.టి.పృథ్విరాజ్ సూచించారు.గురువారం హాలియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలలపై జరిగే లైంగిక వేధింపులు,నేరాల నుంచి రక్షణ కల్పించడంలో పోక్సో చట్టం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు.విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ తమ ప్రాథమిక హక్కులు,రక్షణ చట్టాలు, నిబంధనలపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలని హితవు పలికారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్లు,సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరిగిన తరుణంలో విద్యార్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని న్యాయమూర్తి హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ వేధింపుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదని స్పష్టం చేశారు. డిజిటల్ వేదికలపై లేదా బయట ఏవైనా సమస్యలు ఎదురైతే భయాందోళనలకు గురికాకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల సహాయం తీసుకోవాలని భరోసా ఇచ్చారు.అనంతరం ఎస్ఐ సాయి ప్రశాంత్ మాట్లాడుతూ, తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పోలీస్ అక్క' కార్యక్రమంలో భాగంగా ప్రతి శనివారం మహిళా కానిస్టేబుల్ పాఠశాలను సందర్శిస్తారని తెలిపారు.విద్యార్థినులకు నిరంతరం

అందుబాటులో ఉంటూ వారి సమస్యలను స్వయంగా తెలుసుకొని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎలాంటి వేధింపులు ఎదురైనా ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులను సంప్రదించాలని కోరారు.కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కందిమళ్ళ నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

---

# ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలి

## - దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి నిరంతర తాగునీటి సరఫరా అందించాలి.

## - మిషన్ భగీరథ అధికారులకు ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆదేశాలు.

**దేవరకొండ, అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి) :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే నేపథ్యంలో దేవరకొండ నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆదేశించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి గ్రామానికి నిరంతరాయంగా తాగునీరు అందేలా మిషన్ భగీరథ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.గురువారం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నియోజకవర్గంలోని తాగునీటి సరఫరా పరిస్థితులపై ఎమ్మెల్యే సమీక్షించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా భవిష్యత్తులో తాగునీటి కొరత ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడే ప్రాంతాలను గుర్తించి, సమస్యలు తీవ్రరూపం దాల్చకముందే పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.గ్రామాల్లో తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని, పైపులైన్లలో లీకేజీలు, మోటార్లు, పంపింగ్ వ్యవస్థలు, ఇతర సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడినా అధికారులు తక్షణమే స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై కూడా దృష్టి సారించాలని పేర్కొన్నారు.

**ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడటమే ప్రాధాన్యత**

వేసవి పరిస్థితులు, వర్షాభావ ప్రభావాలను దృష్టిలో ఉంచుకొని తాగునీటి వనరుల లభ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. గ్రామస్థాయిలో తాగునీటి సమస్యలపై సమాచారం సేకరిస్తూ, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ప్రజల నుంచి తాగునీటి సరఫరాపై వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, వాటికి వెంటనే పరిష్కారం చూపాలని ఆదేశించారు.ప్రజలకు తాగునీరు అందించడం అత్యంత ప్రాధాన్యమైన అంశమని పేర్కొంటూ, ఈ విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బాలు నాయక్ స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో తాగునీటి సరఫరా సజావుగా సాగేలా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# పేద విద్యార్థులకు అండగా పీపీఆర్ ఇగ్నైట్ విద్యాజ్యోతి ఫౌండేషన్

## 30 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజుల అందజేత

**నాగారం, అక్టోబర్ 29 ప్రజా జ్యోతి.**

విద్యార్థులను ప్రోత్సహించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలనే లక్ష్యంతో పీపీఆర్ ఇగ్నైట్ విద్యా జ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజులు అందజేశారు. నాగారం మండల పరిధిలోని ఫణిగిరి ప్రభుత్వ పాఠ శాలలో పదో తరగతి చదువుతున్న ముప్పై మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ నూట ఇరువై ఐదు రూపాయలు చొప్పున మొత్తం మూడు వేల ఏడు వందల యాభై రూపాయల పరీక్ష ఫీజుల నిమిత్తం ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ పందిరి అనురాధ పరశురాం గురువారం అందించారు. వారి తల్లిదండ్రులు పందిరి లక్ష్మి వెంకటయ్య జ్ఞాపకార్థం ఈ సహాయం చేశారు. ఈ మొత్తాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్ రెడ్డికి పంపించారు.

### విద్యతో వెలుగు ప్రోత్సాహంతో భవిష్యత్తు.

ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ కన్నతల్లిదండ్రులు ఎప్పటికీ గుర్తుండాలని మనకు జన్మనిచ్చిన ఊరికి ఎంతో కొంత సేవ చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఆశీస్సులతో విద్యార్థులకు అందిస్తున్న ఈ చిన్న సహాయం వారి భవిష్యత్తుకు గొప్ప ప్రోత్సాహంగా నిలవాలని ఆకాంక్షించారు.

### విద్యతో వెలుగు--ప్రోత్సాహంతో భవిష్యత్తు

అనే నినాదంతో ప్రతి సంవత్సరం ఫణిగిరి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థులకు పరీక్ష ఫీజులు అందజేస్తామని వెల్లడించారు. విద్యార్థుల చదువుకు చేయూతనివ్వడం గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావడం తమ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని పాఠశాల తరపున, గ్రామ యువత తరపున పలువురు అభినందించారు.

# పట్టభద్రులందరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలి

**నవంబర్ 6 వరకు గడువు.. అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలి.**

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనూ ఆన్‌లైన్ నమోదు సదుపాయం.

- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**దేవరకొండ, అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి) :**

దేవరకొండ నియోజకవర్గ పరిధి లోని అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో తమ పేర్ల నమోదుకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కోరారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియకు నవంబర్ 6వ తేదీ వరకు గడువు ఉన్నందున, చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజా స్వామ్య ప్రక్రియలో ఓటు హక్కు కీలకమని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును పొందేందుకు అవసరమైన ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు.

### ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సదుపాయం

పట్టభద్రుల సౌకర్యార్థం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనూ ఆన్‌లైన్ ఓటరు నమోదు సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు బాలు నాయక్ వెల్లడించారు. అర్హులైన పట్టభద్రులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో క్యాంపు కార్యాలయానికి వస్తే నమోదు ప్రక్రియలో సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

### నవంబర్ 6లోగా నమోదు పూర్తి చేయాలి.

ఓటరు నమోదుకు నిర్దేశించిన గడువును దృష్టిలో ఉంచుకుని అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గంలోని పట్టభద్రులు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులకు కూడా ఈ విషయాన్ని తెలియజేసి, అర్హులైన వారందరూ ఓటరు నమోదుపై దృష్టి సారించేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పాఠశాల వేళల్లో రిటైర్మెంట్ వేడుకలా? బలవంతపు వసూళ్లా?

## - విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి:

## - కే. బాబురామ్ నాయక్

**దేవరకొండ, అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి) :**

పాఠశాల బోధనా సమయాల్లో ఉద్యోగ విరమణ వేడుకలు నిర్వహించడం,ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలను రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ సొసైటీ ఫౌండర్, జాతీయ అధ్యక్షుడు కే. బాబురామ్ నాయక్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత కలిగిన అధికారులే నిబంధనలను ఉల్లంఘిస్తున్నారంటూ ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బోధనా సమయాన్ని పూర్తిగా చదువుకే కేటాయించాల్సి ఉండగా, నేరేడుగొమ్ము మండలంలో ఉద్యోగ విరమణ వేడుకల పేరుతో ఉపాధ్యాయులు, విద్యార్థులను తరగతులకు దూరం చేయడం సరైన పద్ధతి కాదని బాబురామ్ నాయక్ పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి తాటికొండ బ్రహ్మ చారి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు తూల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిబంధనలకు విరుద్ధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారంటూ ఆయన ఆరోపించారు.

### బలవంతపు వసూళ్లపై ఆరోపణలు

రిటైర్మెంట్ వేడుకల పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి డబ్బులు, సరుకులు వసూలు చేస్తున్నారనేది తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ఆయన అన్నారు. తన ప్రకటనలో పేర్కొన్న వివరాల ప్రకారం, ప్రాథమిక పాఠశాలల నుంచి రూ.1,000, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి రూ.1,500, ఉన్నత పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల నుంచి రూ.2,000 చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఒక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో ఈ మొత్తాలను జమ చేయడం గమనార్హమని పేర్కొన్నారు.అలాగే మోడల్ పాఠశాల నుంచి బియ్యం, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం నుంచి చికెన్ సేకరిస్తున్నట్లు ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి డబ్బులు, సరుకులు సేకరించడం. సమంజసం కాదని, ఇలాంటి చర్యలు విద్యాశాఖ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని అన్నారు.

### విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

పాఠశాలల్లో బోధనా సమయాల్లో వేడుకలు నిర్వహించడం, బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని బాబురామ్ నాయక్ కోరారు. బ్యాంకు ఖాతాల లావాదేవీలు, డబ్బుల వసూళ్లు, సరుకుల సేకరణపై సమగ్ర విచారణ జరిపించి, ఆరోపణలు నిర్ధారణ అయితే బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల విద్యాహక్కును కాపాడటంతో పాటు ఉపాధ్యాయులపై అనవసర ఒత్తిళ్లను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ వ్యవహారంలో న్యాయం జరగకపోతే బాధిత ఉపాధ్యాయులను కలిసి, తమ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య బద్ధంగా, చట్టపరంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం.. ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి....!!!

**అనంతగిరి, అక్టోబర్ 29(ప్రజాజ్యోతి)**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు యాసంగి పంటల ప్రణాళికలో తగిన మార్పులు చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరికి బదులుగా ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.అనంతగిరి మండలం వాయిల సింగవరం గ్రామంలో రైతులకు నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అందె సతీష్ మాట్లాడుతూ, భూగర్భ జలాలపై ఒత్తిడి పెరగకుండా నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. పెసర, మినుము, శనగ, వేరుశనగ వంటి ఆరుతడి పంటల సాగుతో నీటిని ఆదా చేయడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని వివరించారు. గడ్డిపల్లి వ్యవసాయ శాస్త్రవేత్త ఆదర్శ్ మాట్లాడుతూ, నేల స్వభావం, భూమిలో తేమ, నీటి లభ్యతను బట్టి రైతులు అనువైన పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. పంట మార్పిడి, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువుల ప్రోత్సాహం ద్వారా నేల సారవంతతను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు మాట్లాడుతూ, భూగర్భ జలాల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, నీటి వనరులను కాపాడేందుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈవో అన్వేష్, హెచ్‌ఈఓ ఇస్మాయిల్, పంచాయతీ కార్యదర్శి సౌమ్య, రైతులు కొల్లు సుబ్బారావు, గద్దె రామారావు, దేవులపల్లి నరసింహారావు, రేవూరి శ్రీనివాసరావు, గుండ్లపల్లి వెంకన్న, గూడపురి కోటయ్య, కొరివి వెంకటేశ్వర్లు, బుర్రా వీరబాబు, దాములూరి సత్యనారాయణ, వీరబోయిన సైదులు, బుర్రా నాగమల్లేశ్వరరావు, నేరెళ్ల చంద్రయ్య, మల్లెబోయిన మల్సూరు, వార్డు సభ్యుడు బొడ్డుపల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాపై పోలీసుల ప్రత్యేక నిఘా

## మఠంపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన

## - కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి

**మఠంపల్లి, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి)**

సూర్యాపేట జిల్లా మఠంపల్లి పోలీస్ స్టేషన్‌ను కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి వార్షిక తనిఖీలో భాగంగా పరిశీలించారు.ఈ సందర్భంగా సిఐ చరమంద రాజు డీఎస్పీని స్వాగతం పలికారు.అనంతరం పోలీస్ సిబ్బంది పరేడును స్వీకరించారు. స్టేషన్ పరిధిలో మొక్కను నాటారు, పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసి, కేసుల నమోదు తీరును సమీక్షించారు.గత ఏడాదితో పోలిస్తే కేసుల సంఖ్యలో వచ్చిన మార్పులకు గల కారణాలను అడిగి తెలుసుకుని, సిబ్బందికి పలు సూచనలు చేశారు.మండలంలో గంజాయి, డ్రగ్స్, రేషన్ బియ్యం

అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిమెంట్ పరిశ్రమల్లో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కార్మికుల కదలికలపైనా పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మహిళలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసులకు తెలియజేసేందుకు ప్రత్యేక మహిళా కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తున్నామని, గృహహింస బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్ కుమార్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబానికి కిషన్ నాయక్ ఆర్థిక భరోసా

## - వైద్య ఖర్చుల కోసం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేత

**దేవరకొండ, అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి) :**

చందంపేట మండలం మూర్పునుంతల గ్రామానికి చెందిన నాగిళ్ల పార్వతాలు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నేనావత్ కిషన్ నాయక్ మానవతా దృక్పథంతో స్పందించారు. పార్వతాలు వైద్య ఖర్చుల నిమిత్తం ఆయన రూ.10,000 ఆర్థిక సహాయం అందజేసి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు.ఆపద సమయంలో తమకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన కిషన్ నాయక్‌కు పార్వతాలు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొర్ర రమేష్ నాయక్, నాగార్జున, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# పలు శుభకార్యాలలో సందడి చేసిన మండలి చైర్మన్ గుత్తా

**మిర్యాలగూడ, అక్టోబర్ 29,(ప్రజాజ్యోతి):**

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గురువారం మిర్యాలగూడ పట్టణంలో పలు శుభకార్యాలలో పాల్గొని సందడి చేశారు. ముందుగా పట్టణంలోని శ్రీమన్నారాయణ ఫంక్షన్ హాల్లో జరిగిన మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మనవరాలు మనీషా, మహేష్ ల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం పట్టణానికి చెందిన వీటీ డైరీ ఎండి సత్యనారాయణ కుమార్తె హారిక వివాహ నిశ్చితార్థ వేడుక శుక్రవారం జరగనున్నప్పటికీ బిజీ షెడ్యూల్ కారణంగా వచ్చేందుకు వీలు లేకపోవడంతో వారి స్వగృహానికి వెళ్లి హారిక కు నిశ్చితార్థ శుభాకాంక్షలు తెలిపారు. ఆమె భావి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. వారి వెంట మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్), ఎమ్మెల్సీ కె శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, దేశిడి శేఖర్ రెడ్డి, గుడిపాటి సైదులు బాబు తదితరులు ఉన్నారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్.. నీటి సంరక్షణ తప్పనిసరి

- ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించాలి
- జెడ్పీ సీఈవో శోభారాణి, డీపీవో శ్రీనివాస్‌రెడ్డి

**చౌటుప్పల్, అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి)**

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తలెత్తే తీవ్ర నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈవో శోభారాణి, డీపీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం తుప్రాన్ పేట లో నిర్వహించిన గ్రామసభలో వారు పాల్గొని మాట్లాడారు. భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఇంట్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు, వ్యవసాయ భూముల్లో ఫామ్ పాండ్లు (పంట కుంటలు) నిర్మించుకోవాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం ద్వారానే భవిష్యత్‌లో తాగు, సాగునీటి ఇబ్బందులు రాకుండా చూసుకోవచ్చని పేర్కొన్నారు. విలువైన నీటిని ఎక్కడా వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీలత, డీఎల్‌పీవో ప్రతాప్‌నాయక్, సర్పంచ్ బక్కతట్ల రాధిక శ్రీశైలం, ఉపసర్పంచ్ ముద్దం రమేష్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వారం రోజుల్లో రెండోసారి కొండచిలువ కలకలం

కందుకట్లగూడెంలో రైతు పొలంలో కొండచిలువ.

భయాందోళనలో గ్రామస్తులు

**నాగారం అక్టోబర్ 29 ప్రజా జ్యోతి.**

నాగారం మండలంలో కొండచిలువల సంచారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. మండల పరిధిలోని కందుకట్లగూడెం గ్రామానికి చెందిన రైతు కంచుగట్ల నరేష్ పొలంలో కొండచిలువ కనిపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వారం రోజుల వ్యవధిలోనే మరోసారి కొండచిలువ కనిపించడంతో రైతులు, గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. పొలాల వద్దకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు జాగ్రత్తగా ఉండాలని గ్రామస్తులు సూచిస్తున్నారు.

# అనుముల రైతులపై సర్కారు చిన్నచూపు.!

**హాలియా,అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి)**

నల్లగొండ జిల్లాలో 33 మండలాలకు గాను 28 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించి అనుముల మండలాన్ని విస్మరించడం అన్యాయమని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. మండలంలో తీవ్ర వర్షాభావంతో పత్తి,వరి పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,సుమారు 40 వేల ఎకరాల సాగుభూమి ఉన్న అనుముల మండలంలో కనీసం 20 శాతం పంటలు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. సాగునీరు,విద్యుత్ సరఫరా సమస్యలతో పంటలు ఎండిపోయి పొలాలు బీళ్లుగా మారాయని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి అనుముల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి,ఎంపీ, సీనియర్ నాయకుడు జానారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన ఉద్యమం చేపట్టి, కరువు మండలంగా గుర్తింపు వచ్చే వరకు పోరాడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వద్దే సతీష్ రెడ్డి,పిఏసిస్ చైర్మన్ రెక్కల మధుసూదన్ రెడ్డి, నల్గొండ సుధాకర్,కర్న నర్సిరెడ్డి, మాజీ కౌన్సిలర్ వర్ర వెంకటరెడ్డి, సర్పంచ్ కూన్ రెడ్డి భాస్కర్ రెడ్డి చాపల సైదులు,చేగొండి కృష్ణ యాదవ్,చిట్టిప్రోలు శ్రీనివాస్, ఎడవల్లి నాగరాజు,పిల్లి వెంకట్ యాదవ్,సురభి రాంబాబు, దుండిగళ్ళ నరసింహ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రామన్నపేటలో 2 కె రన్ నిర్వహణ

- పోలీసులు, విద్యార్థులు, యువత ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిరోజూ వ్యాయామం చేయాలి
- జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్

**రామన్నపేట అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి)**

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో రామన్నపేటలో 2 కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ హాజరై, రన్‌లో ముందుండి పాల్గొని పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువతకు ఉత్సాహాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని సూచించారు. పోలీసు విధుల్లో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ఫిట్‌గా ఉండేందుకు నిత్యం వ్యాయామం చేయాలని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, పోలీసు శాఖకు మరియు ప్రజలకు మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ డీఎస్పీ

మధుసూదన్ రెడ్డి,రామన్నపేట సీఐ శ్రీ ఎం. రవి, రామన్నపేట ఎస్ఐ జి. సతీష్, వలిగొండ ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, ఆత్మకూరు (ఎం) ఎస్ఐ లక్ష్మీనారాయణ, మోత్కూరు ఎస్ఐ సతీష్, అడ్డగూడూరు ఎస్ఐ వెంకట్ రెడ్డి, ఏఎస్ఐ సురేందర్, హెడ్ కానిస్టేబుళ్లు కమలాకర్, వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది లింగస్వామి, స్వామి నాయక్, ప్రవీణ్, ప్రశాంత్, స్వామి, మధు, కృష్ణమూర్తి, నరసింహ, లావణ్య, కవిత, సైదులు, సైదయ్య తదితరులు పాల్గొన్నారు..

# కట్టంగూరును తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలి

## బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజు డిమాండ్

**నల్లగొండ అక్టోబర్ 29( ప్రజాజ్యోతి ప్రతినిధి)**

నకిరేకల్ నియోజకవర్గంలోని కట్టంగూరు మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజు ఆధ్వర్యంలో గురువారం రైతాంగ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నలగాటి ప్రసన్నరాజు మాట్లాడుతూ.. నల్గొండ జిల్లాలో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ ముందస్తు అంచనాలు, ప్రణాళికల్లో లోపాల కారణంగా రైతులు సాగుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి కారణంగా పశుగ్రాసం కొరత ఏర్పడి పశుసంపదకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. పంటలు సాగు కాకపోవడంతో వ్యవసాయ కూలీలు, చేతివృత్తులపై ఆధారపడిన కుటుంబాలు, రోజువారీ కూలీలు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై సమగ్రంగా అంచనా వేసి నివేదిక తెప్పించుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే కట్టంగూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించడంతోపాటు, నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి రైతాంగంతోపాటు పేద కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కట్టంగూరు మండల మాజీ అధ్యక్షుడు ఊట్కూరు ఏడుకొండలు,

నల్గొండ జిల్లా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుండాల మల్లేష్ గౌడ్, రైతు సంఘం మాజీ మండల అధ్యక్షుడు చిట్యాల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ ముప్పిడి యాదయ్య, పాదూరు శశిపాల్ రెడ్డి, రేకల రాజు, ఊట్కూరు నాగయ్య, నిమ్మనగోటి శివశ్రీను, పాపయ్య, కట్ట శంకర్, ఊట్కూరు రవి, ముసుకు శంకర్, తండు సోమయ్య, జాన్ రెడ్డి, రాచకొండ లింగయ్య, రూపని వెంకటయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# వరి కి బదులుగాప్రత్యామ్నాయ పంటలే మేలు....!

## - ఏడిఎ జగదీష్ రెడ్డి

**మిర్యాలగూడ,అక్టోబర్ 29, (ప్రజాజ్యోతి):**

మిర్యాలగూడ మండలంలో సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడిఎ) కె. జగదీష్ రెడ్డి గురువారం విత్తన విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరి రైతులు వరి సాగుకు బదులుగా కంది, పెసర, మినుము, ఉలవలు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. రైతులు నీటి వనరులు, వాతావరణపరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులను పరిగణలోకి తీసుకొని పంటల వైవిధ్యాన్ని పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా నీటి వనరులను ఆదా చేయడంతో పాటు, స్థిరమైనవ్యవసాయాన్ని ప్రోత్సహించవచ్చని తెలిపారు.ఆయన వెంట మండల వ్యవసాయ అధికారిణి ఎం.బుష్యేంద్రమణి తదితరులు ఉన్నారు.

# జూలూరు- రుద్రవెల్లి వంతెన నిర్మాణం తక్షణమే చేపట్టాలి

## - బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి):**

మండలంలోని జూలూరు -రుద్రవెల్లి మూసీ వంతెన నిర్మాణం తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ పోచంపల్లి టౌన్, మండల శాఖల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండల అధ్యక్షుడు మేకల రవీందర్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు దబ్బికార సాయిష్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్ మాట్లాడుతూ, రుద్రవెల్లి--జూలూరు మూసీ వంతెన నిర్మాణం పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు రాకపోకలు సులభతరమవుతాయని పేర్కొన్నారు. ప్రజల రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గూడూరు నర్సింహ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు కల్లాలు ఏర్పాటు చేయాలి:

## - నవీన్ రెడ్డి..

**నూతనకల్.. అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి):**

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఇమ్మారెడ్డి నవీన్ రెడ్డి మండిపడ్డారు.. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే రైతు కల్లాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ఐకెపి సెంటర్లను వెంటనే ప్రారంభించాలన్నారు.. ధాన్యం కొనుగోలులో తేమశాతం పరిమితిని ప్రస్తుత 17 శాతం నుంచి 22 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు.. బోనస్‌తో కలిపి రైతులకు ప్రతి క్వింటా ధాన్యానికి రూ. 3,200 చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.. దళారుల ప్రమేయాన్ని అరికట్టి, రైతులకు నేరుగా లబ్ధి చేకూరేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి, వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందించాలని... రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాల నవీన్ రెడ్డి కోరారు..

# వరి పంటలో శాస్త్రీయ సస్యరక్షణపై రైతులకు అవగాహన

**గరిడేపల్లి ,అక్టోబర్ 29(ప్రజా జ్యోతి):**

వరి పంటలో శాస్త్రీయ సస్యర క్షణపై రైతులకు ఏలూరులోని సీహెచ్ఎస్‌డీ సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల వ్యవసాయ విద్యార్థినులు అవగాహన కల్పిం చారు.గురువారం సూర్యా పేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిప ల్లి గ్రామంలో వరిపంటలో కాం డం ద్వారా పురుగుమందుల వినియోగంపై రైతులకు అవగా హన హన కల్పించారు.కాండం తొలిచే పురుగుల నివారణకు సరైన పద్ధతిలో మందుల విని యోగం,చీడపీడలను తొలిదశ లో గుర్తించడం,సిఫార్సు చేసిన మోతాదులో పురుగు మందులు వాడటం గురించి వివరించారు. రసాయన మందుల వినియోగం లో భద్రతా జాగ్రత్తలు పాటిస్తూ, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు కె. అప్పయ్య,వి. శేఖర్,చి.వెంకటేశ్వర్లు, కె.రాంబాబు,జి.శ్రీనివాస్, బి.నాగయ్య పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతల ఏర్పాటు పై మేట్ లకు శిక్షణ

**మిర్యాలగూడ,అక్టోబర్ 29, (ప్రజాజ్యోతి):**

నీటిపరిరక్షణకై ఇంకుడు గుంతలు ఏర్పాటు పై మిర్యాలగూడ ఎంపిడిఓ ఎం.శేషగిరిశర్మ సూచన మేరకు గురువారం ఉపాధి హామీ మేట్‌లకు శిక్షణ కార్యక్రమం స్థానిక రైతువేదికలో నిర్వహించారు. కార్యక్రమంలో మేట్‌లకు వివిజిరాం పనుల నిర్వహణ, కూలీల హాజరు నమోదు ఉపాధి హామీ పనుల అమలుకు సంబంధించిన అంశాలపై ఎపిఓ సూరానాయక్ శిక్షణ ఇచ్చారు. ఇళ్లల్లో , పొలాల్లో ఇంకుడు గుంతలు ఎలా ఎన్ని మీటర్లలో ఏర్పాటు చేయాలో మార్కింగ్ చేసి చూపెట్టారు. ప్రస్తుతం ఎల్ నీనో ప్రభావం కొనసాగుతున్నందున నీటి పరిరక్షణ చర్యలు అవసరమని, ప్రతి ఇంట, ప్రతి పంట పొలాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటుకు ప్రజలను చైతన్య పర్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఇసిలు ఎం.కళావతి, పద్మలు పాల్గొన్నారు.

# గొలనుకొండలో గ్రామసభ

**ఆలేరు అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని గోలనుకొండ గ్రామంలో గ్రామ సర్పంచ్ ఇందూరి యాదిరెడ్డి ఆధ్వర్యంలో ఏలినివో పరిస్థితిలు అధికమవుతున్న దృష్ట గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్ హాజరై మాట్లాడుతూ రాబోయే కరువు పరిస్థితులను ఎదుర్కొనే విధంగా ప్రణాళికను అవసరమగు వనరులను గుర్తించుట నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అదేవిధంగా పశువులకు పశువుల తొట్లు పశువుల షెడ్లు నిర్మించుకోవాలని పనిలో కూలీలు అధికంగా పాల్గొనాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ అనురాధ దేవి, ఏపీఓ అరుణకుమారి, పంచాయతి రాజు నవ్య, వెటర్నరీ డాక్టర్ యాకూబ్, ఆర్డబ్ల్యూఏఈ సుప్రియ, ఏపీఎం సత్యనారాయణ, ఏఎన్ఎం కవిత రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యమే ముఖ్యం..

- మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి
- మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులకు ఉచిత దంత వైద్య పరీక్షలు..- శ్రీ సత్య డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం..- కార్మికులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి..- డిప్యూటీ మేయర్, కమిషనర్‌తో కలిసి శిబిరాన్ని ప్రారంభించిన మేయర్.

**నల్గొండ, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి):**

నగర పారిశుద్ధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషించే కార్మికులు తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో శ్రీ సత్య డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులకు నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ, కమిషనర్ బి. వంశీకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. కార్మికులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, దంత సమస్యలు తలెత్తిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. శిబిరంలో వైద్యులు అరవింద్ రెడ్డి, జిశాంక్, నందిని పరీక్షలు నిర్వహించారు. ఎం.డి. నజీర్ ఖాన్‌తో పాటు కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విధుల్లో అప్రమత్తత.. ప్రజలకు భరోసా కల్పించాలి!

- డీఐజీ జోయెల్ డేవిస్
- పోచంపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఐజీ, ఎస్పీ అక్షాన్ష్ యాదవ్

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి):**

పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి భరోసా కల్పించాలని డీఐజీ జోయెల్ డేవిస్ సూచించారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్‌తో కలిసి వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన డీఐజీకి ఎస్‌హెచ్‌ఓ జగన్ సిబ్బందిని పరిచయం చేశారు.అనంతరం స్టేషన్ డైరీ, రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, కోర్టు రికార్డులు, వాహనాల నిర్వహణ, సాక్ష్యాధారాల సామగ్రిని పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలని, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి, రామన్నపేట సీఐ రవి, చౌటుప్పల్ రూరల్ సిఐ మన్మథకుమార్, పోచంపల్లి ఎస్ఐ లైలా, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే నివాళులు

**నల్లగొండ అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

శాలిగౌరారం: మండలంలోని ఇటికలపాడు గ్రామ మాజీ సర్పంచ్ అంబటి అంజయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆయన అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ఈ కష్టకాలంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

## - కాంగ్రెస్ నాయకుడి సంతాప కార్యక్రమంలో ధైద రవీందర్

**నల్లగొండ అక్టోబర్ 29 (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

నకిరేకల్: కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు పాల్వాయి గురువయ్య ఇటీవల మృతి చెందడంతో, గురువారం నిర్వహించిన ఆయన దశదిన కర్మ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధైద రవీందర్ పాల్గొని నివాళులర్పించారు. గురువయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి ?5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ధైద రవీందర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, జెండా మోస్తూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్త తమ కుటుంబ సభ్యుడితో సమానమని అన్నారు. కార్యకర్తలకు కష్టాలు ఎదురైనప్పుడు, వారి కుటుంబాలకు అండగా నిలవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. పదవులు శాశ్వతం కాదు.. ప్రజలతో, కార్యకర్తలతో ఉండే అనుబంధమే శాశ్వతమని ధైద రవీందర్ అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు, సర్పంచ్ లక్కపాక వెంకన్న, మాజీ సర్పంచ్ పాల్వాయి వెంకటయ్య, పాల్వాయి గామయ్య, మాజీ ఎంపీటీసీ లోకేష్, మెరుగు బిక్షం, లక్కపాక గోవర్ధన్, లక్కపాక వీరస్వామి, సురేష్, సాగర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు డిజిటల్ టెక్నాలజీ..

## - ఎఫ్ఆర్ఎస్, క్యూఆర్ కోడ్‌తో పటిష్ట భద్రత..

## - కార్మికుల హాజరు నుంచి వాహనాల నిర్వహణ వరకు డిజిటల్ పర్యవేక్షణ- ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం..

## - మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

**నల్గొండ అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి):**

నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా చేపట్టేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్మికుల హాజరు నమోదుకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్), పారిశుద్ధ్య వాహనాల పర్యవేక్షణకు క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా కార్మికుల హాజరును పారదర్శకంగా నమోదు చేయడంతో పాటు, క్యూఆర్ కోడ్ ద్వారా వాహనాల రాకపోకలు, చెత్త సేకరణ, డంపింగ్, డీజిల్ వినియోగం, మరమ్మతుల వివరాలను పర్యవేక్షించవచ్చన్నారు. ఈ విధానం ద్వారా సమయం, ఇంధనం ఆదా అవడంతో పాటు పారిశుద్ధ్య సేవలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండ నగర అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందిస్తామని మేయర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ, కమిషనర్ బి. వంశీకృష్ణ, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నెలిబండ, చందుపట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే వేముల వీరేశం

నల్లగొండ అక్టోబర్ 29 ( ప్రజా జ్యోతి ప్రతినిధి)

నకిరేకల్ మండలం నెలిబండ గ్రామంలో ఎన్‌డీసీఎంఎస్ ఆధ్వర్యంలో, చందుపట్ల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# రాకేష్ రెడ్డి గెలుపే బి ఆర్ ఎస్ లక్ష్యం

## - మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి

ఆలేరు అక్టోబర్ 29 (ప్రజాజ్యోతి)

త్వరలో జరగబోయే వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు అందరూ పని చేయాలని మాజీమంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం కేంద్రంలో వంగపల్లిలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాక సమావేశనికి వారు హాజరై మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు పట్టుదలతో పనిచేసి గ్రామ గ్రామాన హెల్ప్ డెస్కులు ఏర్పాటుచేసి పట్ట బద్రుల ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తన భుజాలపై వేసుకొని అప్లై చేయడానికి ముందుండాలన్నారు. రాబోవి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. కెసిఆర్ ఉంటే నీటి సమస్య రాకపోవునని విద్యుత్ సమస్య రాకపోనని కృష్ణ గోదావరి నీళ్లు పుష్కలంగా ఉండేవని గుర్తు చేశారు. ఎండిపోతున్న పొలాలకు కాంగ్రెస్ పార్టీ కారణమని కరువు కాదని వివరించారు. కన్నెపల్లి పంప్ హౌస్ ప్రారంభం చేసుంటే బస్వాపూర్ గంధ మల్ల లో నీళ్లు బ్రహ్మాండంగా ఉండేవని అవేమీ పట్టించుకోకుండా కబుర్లు మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతంగాన్ని ముంచిన ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో బొంద పెట్టడానికి ప్రతి ఒక్కరు చూస్తున్నారన్నారు. మిగిలిపోయిన ఓటర్లను పట్టభద్రుల ఎమ్మెల్సీ కొరకు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్యగౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి, తుంగ బాలు, కర్రె వెంకటయ్య, పుట్ట మల్లేష్, మామిడాల భానుచందర్, బొట్ల పరమేశ్వర్, రచ్చ రామ నరసయ్య, యాట శివ, లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, జంగస్వామి, పరిదే సంతోష్, మోరిగాడి అశోక్, బండ మహేందర్, మోతే వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# చెర్వుగట్టు అభివృద్ధికి రూ.95 లక్షలతో పనులకు శంకుస్థాపన

నల్లగొండ అక్టోబర్ 29

(ప్రజాజ్యోతి ప్రతినిధి)

: నకిరేకల్ నియోజకవర్గంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చెర్వుగట్టు గుట్టపై, గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా రూ.95 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేశారు. గ్రామంలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు, రూ.15 లక్షలతో పైప్‌లైన్ పనులు, గుట్టపై రూ.60 లక్షలతో బాత్రూం సముదాయం నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, చెర్వుగట్టు క్షేత్రానికి వచ్చే భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులతో పాటు ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి

శుక్రవారం 30 అక్టోబర్ 2026

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న - మంత్రి కోమటిరెడ్డి..

## - దివంగత జర్నలిస్ట్ దత్తురెడ్డి కుటుంబానికి అండగా నిలిచిన వైనం..

## - ప్రియాంకకు న్యాక్‌లో అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగం.. పర్మినెంట్‌పైనా భరోసా

**నల్గొండ అక్టోబర్ 29,(ప్రజా జ్యోతి):**

ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ దివంగత జర్నలిస్ట్ దత్తురెడ్డి కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అండగా నిలిచారు. కుటుంబ పెద్దను కోల్పోయి కష్టాల్లో ఉన్న ఆ కుటుంబానికి గతంలో ఇచ్చిన హామీ మేరకు, దత్తురెడ్డి భార్య ప్రియాంకకు తన శాఖ పరిధిలోని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్)లో అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉద్యోగ అవకాశం కల్పించారు.ఈనాడు జర్నలిస్టుగా పనిచేసిన దత్తురెడ్డి గుండెపోటుతో హఠాన్మరణం చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కామారెడ్డి జిల్లాలోని దత్తురెడ్డి స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ సమయంలో కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. అంతేకాకుండా, దత్తురెడ్డి భార్య ప్రియాంకకు తన శాఖ పరిధిలో ఉద్యోగం కల్పిస్తానని హామీ ఇచ్చారు.తాజాగా ఆ హామీని నెరవేరుస్తూ సంగారెడ్డిలోని న్యాక్‌లో ప్రియాంకకు అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉద్యోగ అవకాశం కల్పించారు. ఆమె ఉద్యోగాన్ని పర్మినెంట్ చేసే అంశంలోనూ భరోసా ఇచ్చిన మంత్రి, ఇందుకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కష్టకాలంలో తమ కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ అవకాశం కల్పించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి దత్తురెడ్డి భార్య ప్రియాంక, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు, దివంగత జర్నలిస్ట్ కుటుంబానికి అండగా నిలిచి, ఇచ్చిన హామీని నెరవేర్చిన మంత్రిపై పలువురు జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలిపారు.

# దేవరకొండ గిరిజన బాలికల గురుకులంలో ఏం జరుగుతోంది?

## - రెండు నెలల క్రితం విద్యార్థిని మిస్సింగ్ తాజాగా ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం!

## - ఘటనపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థినులకు భరోసా కల్పించాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల డిమాండ్

**దేవరకొండ, అక్టోబర్ 29, (ప్రజా జ్యోతి) :**

దేవరకొండ గిరిజన బాలికల సీఓఈ గురుకులంలో వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలు విద్యార్థినుల భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయి. రెండు నెలల క్రితం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని కనిపించకుండా పోయిన ఘటన మరువకముందే, తాజాగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న మరో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ఈ పరిణామాలతో గురుకులంలో విద్యార్థినుల భద్రత, వారికి కల్పిస్తున్న వసతులు, విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.దేవరకొండ నియోజకవర్గం ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గం కావడంతో గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి గురుకులాలు ఎంతో కీలకంగా ఉన్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థినులకు నాణ్యమైన విద్యతోపాటు వసతి, భోజనం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు వెచ్చిస్తోంది. అయితే, విద్యార్థినుల భద్రత, మానసిక ఆరోగ్యం, వారి సమస్యల పరిష్కారంలో సంబంధిత అధికారులు ఎంతవరకు పర్యవేక్షణ చేపడుతున్నారనే అంశంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఆత్మహత్యాయత్నానికి కారణాలేమిటి?

గురుకులంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దుస్తులకు ఉపయోగించే రసాయన పదార్థం సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. అయితే, ఈ ఘటనకు దారితీసిన అసలు కారణాలు ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. విద్యార్థిని మానసిక ఒత్తిడికి గురైందా? ఎవరైనా వేధించారా? లేదా ఇతర వ్యక్తిగత, విద్యాపరమైన సమస్యలేమైనా ఉన్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.విద్యార్థిని ఇంటి నుంచి క్షేమంగా వచ్చి గురుకులంలో చేరిన తర్వాత ఇలాంటి ఘటన చోటుచేసుకోవడానికి దారితీసిన పరిస్థితులేమిటన్నది. చర్చనీయాంశంగా మారింది. విద్యార్థినుల సమస్యలను ఉపాధ్యాయులు, సిబ్బంది సకాలంలో గుర్తిస్తున్నారా? వారు తమ ఇబ్బందులను స్వేచ్ఛగా చెప్పుకునే వాతావరణం ఉందా? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

### అధికారుల పర్యవేక్షణ ఏది?

విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. గురుకులంలో గతంలో విద్యార్థిని కనిపించకుండా పోవడం, తాజాగా మరో విద్యార్థిని ఆత్మ హత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం రావడం నేపథ్యంలో, అక్కడి పరిస్థితులపై సమగ్రంగా పరిశీలన జరపాలని వారు కోరుతున్నారు.

### విద్యార్థి సంఘాల ఆగ్రహం

ఈ ఘటనలపై విద్యార్థి సంఘాల నాయకులు వెంకటేష్, వీవీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం ఐదో తరగతి విద్యార్థిని కనిపించకుండా పోయిన ఘటన, తాజాగా ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వెలుగులోకి వచ్చిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థినులు ఇలాంటి తీవ్ర నిర్ణయాల దిశగా వెళ్లడానికి దారితీస్తున్న పరిస్థితులేమిటో అధికారులు గుర్తించాలని డిమాండ్ చేశారు.సంబంధిత అధికారులు తక్షణమే గురుకులాన్ని సందర్శించి, విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని, ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. విద్యార్థినులకు భద్రతపై భరోసా కల్పించడంతోపాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు.